
శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో..


పాన్‌గల్‌లో..


సూగూరులో..


కొత్తకోట భవానీ ఆలయంలో..


ఆత్మకూర్‌లోని వాసవీమాత ఆలయంలో..


మదనాపురం కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

సల్లంగ చూడు దుర్గమ్మ తల్లీ..

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రులను పురస్కరించుకొని శనివారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు కుంకుమార్చన చేశారు.

■ ఆత్మకూర్ పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి, కేశవస్వామి ఆలయాల్లో స్వర్ణకారుల సంఘం ఆధ్వర్యంలో, వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయం, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయం, వాల్మీకినగర్‌లో అమ్మవారు శాకాంబరిదేవిగా దర్శనమిచ్చారు.

■ పెబ్బేరు మండలంలోని సూగూరు, పెబ్బేరు పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో, వనపర్తి మండలంలోని సవాయిగుడెం, చిట్యాల, అంకూర్ గ్రామాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

■ మదనాపురం మండలంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

■ అమరచింత పట్టణంలోని కాళికామాత ఆలయంలో అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. జగన్‌వాడలో కొలువుదీరిన అమ్మవారికి మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కొత్తకోట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు

■ పాన్‌గల్ మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, గోప్లాపూర్, మాందాపూర్ గ్రామాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. కేతేపల్లి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, కుంకుమర్చన నిర్వహించారు.

■ కొత్తకోట మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో, భవానీమాత ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సహస్ర నామ స్తోత్రముతో శ్రీచక్రానికి కుంకుమార్చన చేసి దూపదీప నైవేద్యాలతో అమ్మవారికి మహామంగళ హారతి ఇచ్చారు. అదేవిధంగా వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో గల అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


ఆత్మకూర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


అమరచింత జగన్‌వాడలో..


ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరుడి ఆలయంలో..

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


ప్రొసీడింగ్స్ అందజేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్

కొత్తకోట రూరల్: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని మదనాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. మహాలక్ష్మి పథకం లబిదారులకు రూ.500కే సిలిండర్ ప్రొసీడింగ్ పత్రాలను శనివారం పట్టణంలోని 1వ వార్డులో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేసి చూపించిన ఘతన సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేని ప్రతిపక్ష నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు లేనిపోని ఆరోపణలు చేస్తున్నార ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎన్‌జే.బోయేజ్, పి.కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు, నవీన్‌రెడ్డి, శ్రీకాంత్, క్రాంతికుమార్, నారాయణ, మహేష్, శ్యామ్, పి.రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పారితోషికం ఇస్తేనే అదనపు పనులు


డాక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు

పాన్‌గల్: పారితోషకం ఇస్తేనే అదనపు పనులు చేస్తామని, లేకుంటే పనులు చేయలేమని ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు ఆదికవిత, ప్రమీల, కాటమోని కవిత మాట్లాడుతూ.. బీపీ, షుగర్ టెస్టులు ఆశా కార్యకర్తలే చేయాలని కలెక్టర్ ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మన జిల్లాలో అదనపు పనులు చేయిస్తున్నారని వాపోయారు. పని భారాన్ని తగ్గించాలని, ఏఎన్‌సీలను పెంచాలని, ఆశా వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలని, స్కూటమీ డబ్బాలను ఆశాలతో మోయించరాదని కోరారు. డిమాండ్ల సాధన కోసం సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాకు అనుమతి ఇవ్వాలని వారు వినతిపత్రంలో కోరారు.

వీఆర్‌ఏల కుటుంబాలను ఆదుకోండి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్‌ఏల వారసులు

అమరచింత: 55 నుంచి 61 ఏళ్ల వయస్సు ఉన్న వీఆర్‌ఏలను ప్రభుత్వం ఆదుకోవాలంటూ శనివారం ఆర్‌డీఓకు వినతిపత్రం అందించినట్లు ఆ సంఘం నాయకుడు రాజశేఖర్ తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ నంబర్లు 81, 85, 98ల వలన 55 నుంచి 61 సంవత్సరాల మధ్య వయస్సున్న వీఆర్‌ఏలకు చెందిన 2,500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తక్కువ సర్వీస్ చేసి ఎలాంటి ఆర్థిక ప్రయోజనం లేకుండా పదవీ విరమణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీఆర్‌ఏల కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీమ్‌అర్జున్, ఆశమ్మ, లక్ష్మి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న లీగల్ డిఫెన్స్ కౌన్సిల్

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అంకూర్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ జి ఉత్తరయ్య మాట్లాడుతూ వినియోగదారుల చట్టాలు, తూనికల కొలతల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వస్తువు కొనేటప్పుడు ఆ వస్తువు యొక్క రేటు, గడువు తేదీ, నాణ్యతను తప్పక పరిశీలించాలన్నారు. అక్కడ ముద్రించిన రేటు కన్నా ఎక్కువ అమ్మినచో టోల్‌ఫ్రీ నంబర్‌కు గాని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. డిఫెన్స్ కౌన్సిల్ శ్రీదేవి మాట్లాడుతూ సైబర్ క్రైమ్స్ రోజురోజుకూ మితి మీరిపోవడంతో అమాయక ప్రజలు తమ ఖాతాలో దాచుకున్న సొమ్మును పోగొట్టుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్లకు, మెస్సేజ్‌లకు స్పందించకూడదని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ముగిసిన మల్టీపర్పస్ కార్మికుల శిక్షణ


ధ్రువపత్రాలు అందుకున్న మల్టీపర్పస్ వర్కర్స్‌తో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలను అధిగమించేందుకు గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ కార్మికులకు నాలుగు రోజుల పాటు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇచ్చిన ప్రత్యేక శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అమిత్‌కుమార్ మాట్లాడుతూ తాగునీటి పథకాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉంటే సమస్యల పరిష్కారానికి ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు. తాగునీటి సరఫరా సహాయకులకు గ్రామాల్లో తలెత్తే చిన్న చిన్న సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించేలా శిక్షణ ఇచ్చామన్నారు. సింగిల్ ఫేస్, త్రిఫేస్ మోటార్లు చెడిపోతే మరమ్మతు చేయడం, కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేసే విధానం, నీటి ట్యాంకుల శుభ్రంపై నైపుణ్యం కల్పించామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సహాయకులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఈ ఉదయ్‌కుమార్, ఎంపీఓ రఘురాములు, మల్టీపర్పస్ వర్కర్స్ ఉన్నారు.

గోపాల్‌పేట: ఉమ్మడి మండలంలోని తాగునీటి సరఫరా సహాయకులకు మండల కేంద్రంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి శనివారం ముఖ్య అతిథిగా ఎస్ఈ వెంకటరమణ హాజరై పలు సూచనలు చేశారు. సహాయకులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు శుద్ధ నీటిని అందించాలని సూచించారు. శిక్షణకు మొత్తం 35 మంది సహాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈ మొగులయ్య, డీఈ జైపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శంకర్ ఉన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



ఖిల్లాఘనపురం: అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా ఉంటుందని ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఉప్పరిపల్లి, ఖిల్లాఘనపురం, కోతులకుంట తండాలకు చెందిన ఐదుగురికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంజాయి రమేష్‌తో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి, దేవన్న, బాల్‌రెడ్డి, వాస నాగేశ్వర్, వెంకట్రాములుగౌడ్, యాదయ్య, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు నడిపించండి

మదనాపురం: మండలంలోని కొన్నూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు నడిపించాలని ఐదు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని బస్సు నడిపిస్తున్నారని, సెలవులు వచ్చినా, ఆదివారం రోజున బస్సు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో నెలివిడి, నర్సింగాపురం, పెద్దతండా, కొన్నూరు, ద్వారకానగరం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సు రాని రోజు ఇతర ప్రాంతాలతో పాటు మండల కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ ఆటోలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పాలకులు, ఆర్టీసీ అధికారులు బస్సును రెగ్యులర్‌గా నడిపించాలని కోరుతున్నారు.

'కాకా'కు ఘన నివాళి



అమరచింత: ప్రభుత్వ ఆదేశాల మేరకు కేంద్ర మాజీ మంత్రి జి.వెంకటస్వామి జయంతి వేడుకలను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. వెంకటస్వామి చిత్రపటానికి పూల వేసి ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు కార్మికుల శ్రేయస్సు కోసం వెంకటస్వామి చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నరసింహులు, యాదయ్య, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి రూరల్: పెబ్బేరు మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం ప్రిన్స్‌పాల్ డా.నరేష్, ఉపాధ్యాయ బృందంతో కలిసి శనివారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డిని కలసివినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్స్‌పాల్ డా.నరేష్ మాట్లాడుతూ పాఠశాల మైదానం లోతట్టు ప్రాంతంగా ఉండడంతో వర్షాకాలంలో నీటితో నిండి చెరువుగా మారుతుందని వాపోయారు. పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వెళ్లడానికి దారిలేకుండా పోయిందన్నారు. విద్యార్థులు ఆటలు ఆడుకోవడానికి వీలు లేకుండా పోయిందని, వర్షం నీరు బయటికి వెళ్లడానికి కాల్వను తవ్వించాలని కోరారు. పాఠశాల వద్ద యూటర్న్ లేకపోవడంతో జాతీయ రహదారిపై వ్యతిరేక మార్గంలో పయనిస్తూ పాఠశాలకు వెళ్తున్నారు. పాఠశాల దగ్గర అండర్ పాస్ ఏర్పాటు చేయించాలని, సర్వీస్ రోడ్డు వేయించాలని ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు గంగాధర్, డా.బుచ్చయ్య, పకీరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

డీజే నిర్వాహకులను ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న డీజే నిర్వాహకులు

ఆత్మకూర్: చదివిన చదువుకు ఉద్యోగాలు లేక ఉపాధి కోసం డీజేలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం డీజేలను నిషేధించడంతో ఉపాధి లేకుండా పోతుందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం డీజే నిర్వాహకుల సంఘం ఆధ్వర్యంలో పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందచేశారు. రూ.లక్షలు ఖర్చు చేసి డీజేలను ఏర్పాటు చేసుకున్నామని, వాటిని ప్రభుత్వం నిషేధించడంతో ఉపాధి లేకుండా రోడ్డున పడుతామని వాపోయారు. రాష్ట్రప్రభుత్వం ఇతర వ్యాపారాలను చేసుకునేందుకు రూ.5 లక్షల రుణ సాయం అందించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సురేష్, కృష్ణబాబు, గంగాధర్, మహేష్, అరుణ్, శ్యామ్ తదితరులు ఉన్నారు.


వనపర్తిలోని విద్యుత్ కార్యాలయంలో బతుకమ్మలతో ఉద్యోగినులు..


శ్రీరంగాపురం కళాశాలలో..

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

సాక్షి, నెట్‌వర్క్: బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ విద్యార్థినులు శనివారం సంబురాలను ఉత్సాహంగా నిర్వహించారు. సోమవారం నుంచి కళాశాలకు దసరా సెలవులు ప్రారంభం అవుతుండడంతో శనివారం కళాశాల ఆవరణలో విద్యార్థులు బతుకమ్మలు పేర్చి, పూజలు చేశారు. అదే విధంగా జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగినులు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యవర్ధన్ రెడ్డి, టీజే విశ్వేశ్వర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపకులు కురుమూర్తి, చైర్‌పర్సన్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.


ఆత్మకూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


పాన్‌గల్ కళాశాలలో..

మెప్మా రిసోర్స్‌పర్సన్ జిల్లా కమిటీ ఎన్నిక

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం తెలంగాణ మెప్మా రిసోర్స్‌పర్సన్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పుట్ట ఆంజనేయులు, అధ్యక్షురాలు జి సరస్వతి, ఉపాధ్యక్షులు గోపమ్మ, శ్రీలక్ష్మి, వేణుగోపాల్, యాస్మిన్ ఖాతున్, ప్రధాన కార్యదర్శి లావణ్య, సహాయకార్యదర్శులు మంజుల, బషీరాబేగం, జలజ, సంగీత, ప్రమీల, భారతి, కోశాధికారిగా ఖాజా, కమిటీ సభ్యులు జయ, కాథూన్, రాజేశ్వరి, నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ నూతన కమిటీ భవిష్యత్‌లో ఆర్పీల సమస్యల పరిష్కారం అయ్యేందుకు, 6 నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు.

లారీ, ట్రాలీ ఆటో ఢీ: ఇద్దరికి గాయాలు



కొత్తకోట రూరల్: ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం తెల్లవారుజామున పాలెం బైపాస్ ఎన్‌హెచ్44పై చోటు చేసుకుంది. ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి 9 గంటలకు నంద్యాల నుంచి పాత ఫ్రిజ్‌ల లోడ్‌తో ట్రాలీ ఆటో హైదరాబాద్ బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట పాలెం బైపాస్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో.. ట్రాలీ ఆటో లారీని వెనక నుంచి డీకొట్టింది. ఘటనలో ఆటో డ్రైవర్ కృష్ణకు స్వల్ప గాయాలు కాగా.. పక్క సీట్లో కూర్చున్న రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108కు, పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది తీవ్రంగా గాయపడిన రాజును వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ హిందీ పండిట్‌గా సునీత



అమరచింత: పట్టణంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా విధులు నిర్వహిస్తున్న ఆత్మకూర్‌కు చెందిన బండారు సునీత ఉమ్మడి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును శనివారం మహబూబ్‌నగర్ డీఈఓ రవీందర్ చేతుల మీదుగా అందుకున్నారు. మహబూబ్‌నగర్‌లోని రాజీవ్ విద్యామిషన్ సమావేశ మందిరంలో జరిగిన అంతర్జాతయ ఉపాధ్యాయ దినోత్సవం, అహల్యభాయి హోల్కర్ త్రి శతాబ్ది జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సామాజిక సమరసత వేదిక నిర్వహించిన కార్యక్రమంలో బండారు సునీత అవార్డును అందుకున్నారు. ఉపధ్యాయురాలుగా గానే కాకుండా కవయిత్రిగా, రచయిత్రిగా, సామాజిక సేవకురాలిగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న బండారు సునీతను ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పాఠశాలకు చెందిన ఉపద్యాయురాలు బండారు సునీతకు ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని పాఠశాల హెచ్‌ఎం కృష్ణవేణమ్మ తెలిపారు.